VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ బుధవారం 14 జనవరి 2026

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:03 సంచిక: 142

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



2వ.

## గ్రామాల్లో మొదలైన సంక్రాంతి సందడి

## మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో 52,43,023 మంది ఓటర్లు




2వ.

**మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల తుదిజాబితా ప్రకటన**

**26,80,014 మంది మహిళా ఓటర్లతో వారిదే అగ్రస్థానం**

**నిజామాబాద్ కార్పొరేషన్‌లో అత్యధికంగా 3,48,051 మంది ఓటర్లు**

రాష్ట్రంలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల కోసం పురపాలకశాఖ కసరత్తు ముమ్మరం చేసింది. రిజర్వేషన్లు ఖరారైన తర్వాత నోటిఫికేషన్ విడుదల కానుంది. జనాభా ప్రాతిపదికన వార్డులు, డివిజన్లు, ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల రిజర్వేషన్లను ఖరారు




- వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లలో తవ్వినకొద్దీ వెలుగులోకి అక్రమాలు
- ఆడిట్‌లో రెండు రకాల లావాదేవీల్లో తేడాల గుర్తింపు!
- ఆయా లావాదేవీలపై తహసీల్దార్ల వివరణ కోరిన
- ఉన్నతాధికారులు... వాటిల్లో దోపిడీ జరిగినట్లు తేలితే స్కామ్ విలువ రూ. వందల కోట్లలోనే..
- సీసీఎల్‌ఏలో పనిచేస్తున్న వారి అండతోనే ఈ బాగోతం?
- అధికారుల నిర్లక్ష్యం, సాంకేతికత దుర్వినియోగం,సిబ్బంది కుమ్మక్కు కోణంలో దర్యాప్తు
- చలాన్లను ఎడిట్ చేయకపోతే కచ్చితంగా హ్యాక్ చేసి ఉంటారనే అనుమానం

# అంతులేని దోపిడీ!

హైదరాబాద్: వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల విషయంలో జరుగుతున్న అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. చలాన్ల ఎడిటింగ్ ద్వారా రూ. 50 కోట్ల ప్రభుత్వ సొమ్మును పక్కదారి పట్టించిన వ్యవహారంపై జరుగుతున్న దర్యాప్తులో మరిన్ని విస్మయకర అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. జనగామ, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి తదితర జిల్లాల్లో జరిగిన ఈ కుంభకోణంపై ఆరా తీసేందుకు రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు రాష్ట్రవ్యాప్తంగా తాజాగా నిర్వహించిన ఆడిట్‌లో రెండు రకాల ప్రధాన లావాదేవీల్లో తేడాలు గుర్తించినట్లు తెలుస్తోంది. ఒకే రిజిస్ట్రేషన్ కోసం రెండు చలాన్లు కట్టే వెసులుబాటు ఉండటంతో తక్కువ మొత్తంలో కట్టిన చలాన్‌ను ప్రభుత్వానికి చెల్లించి ఎక్కువ మొత్తంలో కట్టిన చలాన్‌ను వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లోకి మరల్చుకున్నారని ఆడిట్‌లో తేలినట్లు సమాచారం. అలాగే సేల్‌డీడ్‌ల రిజిస్ట్రేషన్ తర్వాత వాటిని రద్దు చేసుకున్నట్లు చూపి క్యాన్సిలేషన్ ఫీజు కింద రూ. 2 వేలు చెల్లించి అంతకుముందు చేసుకున్న రిజిస్ట్రేషన్‌ను కొనసాగిస్తున్నారా అనే సందేహం కూడా ఈ పరిశీలనలో తలెత్తింది. అయితే ఈ రెండు అంశాల్లో ఏ మేరకు ఏం జరిగిందన్న దానిపై ఉన్నతాధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఈ రెండు అంశాల్లో తేడాలున్న లావాదేవీల వివరాలను తహసీల్దార్లకు పంపి వివరణ కోరారు. ఒకవేళ తాజా ఆడిట్‌లో తేలిన ఈ రెండు అంశాల్లోనూ దోపిడీ జరిగినట్లు తేలితే వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల కుంభకోణం విలువ రూ. వందల కోట్లలో ఉంటుందని రెవెన్యూ శాఖ వర్గాలు అంటున్నాయి. నాలుగు స్థానాలు... మూడు కోణాలు తాజా కుంభకోణం వెనుక నాలుగు స్థానాల్లో పనిచేసే సిబ్బంది, అధికారులపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మీ--సేవా కేంద్రాల నిర్వాహకులు, పోర్టల్ ఆపరేటర్లు, సీసీఎల్‌ఏ సిబ్బంది పాత్రతోపాటు తహసీల్దార్ల నిర్లక్ష్యం వల్లే అక్రమాలు జరిగాయని ప్రాథమికంగా నిర్ధారణ అయింది. ఈ నేపథ్యంలోనే రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం, సాంకేతిక పరిజ్ఞాన దుర్వినియోగం, సిబ్బంది కుమ్మక్కు అనే మూడు కోణాల్లో దర్యాప్తు వేగవంతమవుతోందని.. స్కామ్ జరిగి ఉండొచ్చని అనుమానిస్తున్న జనగామ, యాదాద్రి,

రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలతోపాటు మిగిలిన చోట్ల జరిగిన లావాదేవీలపైనా దర్యాప్తు జరుపుతున్నామని ప్రభుత్వం నియమించిన విచారణ కమిటీ వర్గాలు చెబుతున్నాయి. మరో 4--5 రోజుల్లో అన్ని అంశాలు కొలిక్కి వస్తాయని అంటున్నాయి. అయితే చలాన్ల ఎడిటింగ్ ద్వారానే అక్రమాలు జరిగాయన్నది ఉన్నతాధికారుల ప్రాథమిక అభిప్రాయమైనప్పటికీ అలా జరిగి ఉండకపోతే మాత్రం ఏకంగా పోర్టల్‌ను హ్యాక్ చేసి ప్రభుత్వ సొమ్మును కాజేసి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. ఈ కోణంలోనూ దర్యాప్తు జరుగుతున్నట్లు తెలుస్తోంది.

## విజయవాడ రహదారిలో కొనసాగుతున్న రద్దీ

భారీగా వాహనాల రాకతో ట్రాఫిక్ జామ్





2వ.

## కవితను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే అవకాశం లేదు

బిఆర్‌ఎస్‌కు గతమే తప్ప భవిష్యతు లేదు...రాదు

కెసిఆర్ కుటుంబ అవినీతిపై కవిత వ్యాఖ్యలే నిదర్శనం

మీడియాతో పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

## రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు



**70.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ**

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి**

హైదరాబాద్: ధాన్యం కొనుగోలులో తెలంగాణ రికార్డు సృష్టించిందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ముందెన్నడూ లేని రీతిలో 70.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రికార్డు నెలకొల్పిందని అన్నారు. 2025-26 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం ముందెన్నడూ లేని రీతిలో 70.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసిందని అన్నారు. గతంలో కొనుగోలు చేసిన 70.2 లక్షల మెట్రిక్ టన్నుల రికార్డును ఈ ఖరీఫ్ సీజన్‌లో అధిగమించిందని చెప్పారు. ధాన్యం కొనుగోలు పక్రియలో చారిత్రక మైలురాయి అని అభివర్ణించారు. పౌరసరఫరాల శాఖ, నీటిపారుదల శాఖలు సమన్వయం చేసుకోవడంతోపాటు రాష్ట్ర రైతుల భాగస్వామ్యంతోనే ఈ రికార్డు సాధ్యమైందని స్పష్టం చేశారు. ధాన్య సంపదకు ప్రతీకగా నిలిచే సంక్రాంతి పండగ చేసుకుంటున్న రైతులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం కొనుగోలు చేసిన 70.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంలో 32.45 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దొడ్డు రకం కాగా, 38.37 లక్షల మెట్రిక్ టన్నులు సన్నాలని మంత్రి వివరించారు. తెలంగాణలో సాధించిన దిగుబడికిగాను రాష్ట్రవ్యాప్తంగా 13.97 లక్షల మంది రైతులకు మద్దతు ధర అందించామన్నారు.

## ఉద్యమాల పేరిట ప్రజల్ని రెచ్చగొడితే ఊరుకోం

మహబూబాబాద్: జిల్లాల పునర్విభజన అంశంపై ఉద్యమాల పేరిట ప్రజల్ని రెచ్చగొడితే చూస్తూ ఊరుకోబోమని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. భారత రాష్ట్ర సమితికి చెందిన మాజీ మంత్రి కేటీఆర్‌ను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అశాస్త్రీయంగా జిల్లాలు, డివిజన్లు, మండలాల విభజన జరిగిన ప్రాంతాలను విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసి సరిచేస్తామని సీఎం చెప్పారని... ఆ ప్రక్రియను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. భారత రాష్ట్ర సమితి ప్రభుత్వ హయాంలో దండాలు పెట్టినవారికి జిల్లాలు.. శాలువాలు కప్పి, బోకేలు ఇచ్చినవారికి మండలాలు ఇచ్చారని పొంగులేటి ఆరోపించారు. మంగళవారం ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో ఎమ్మెల్యే మట్టా రాగమయి అధ్యక్షతన నిర్వహించిన సర్పంచులు, ఉప సర్పంచుల అభినందన సభలో, మహబూబాబాద్‌లో ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ అధ్యక్షతన నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మంత్రి



మాట్లాడారు."కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా ఏం చేశారని అడుగుతున్నారు. వారిలా మేం ఆర్భాటాలు చేసుకోవడం లేదు. వారి హయాంలో పదేళ్లు తండ్రి, కుమారుడు, కుమార్తె, అల్లుడు రాజుల తరహాలో పాలన చేశారు. వారు అమలు చేసిన ఏ పథకాన్ని తీసేశాం? ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాం. భారత రాష్ట్ర సమితి ప్రభుత్వ హయాంలో రూ.లక్ష మాత్రమే రైతు రుణమాఫీ చేశారు. రూ.2 లక్షల చొప్పున 25 లక్షల మందికి రూ.28 వేల కోట్లు రుణమాఫీ చేశారా? మేం ఎకరాకు రూ.12 వేల చొప్పున 9 రోజుల్లో రూ.9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేశాం. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక ప్రభుత్వానికి రెఫరెండమని అన్నవారు ఓడిపోయాక స్పందించడం లేదు. అసెంబ్లీలో కృష్ణా, గోదావరి జలాలపై మాట్లాడదామంటే సమాధానం చెప్పలేక పారిపోయారు. మున్సిపల్ ఎన్నికల్లోనూ నూరు శాతం ఫలితాలు సాధిస్తాం. పంచాయతీ ఎన్నికల్లో ఓడిపోయినవారికి ప్రభుత్వం అండగా ఉంటుంది" అని పొంగులేటి పేర్కొన్నారు. కార్యక్రమాల్లో ఎంపీలు రామసహాయం రఘురాంరెడ్డి (ఖమ్మం), పోరిక బలరాంనాయక్ (మహబూబాబాద్), సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.



2వ.

## గాంధీ పేరుతో కాంగ్రెస్ నీచ రాజకీయం

- పథకాలతో సహా అన్నిటికి ఇంది, రాజీవ్ పేర్లేనా
- వాల్మీకి-అంబేడ్కర్ పేరున్న పథకం పేరు ఎందుకు మార్చారు
- కాంగ్రెస్ రాజకీయాలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి
- కరీంనగర్ మున్సిపాలిటీలో బిజెపి జెండా ఎగరేస్తాం
- కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు

వారసత్వ రాజకీయాలను గాంధీ వ్యతిరేకించారని గుర్తుచేశారు. అలాగే ఆయన పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ వ్యాఖ్యలపై స్పందించారు. రాముడి బాటలో నడుస్తామని, రాముడి ఆలయాలను నిర్మిస్తామని తాము చెప్పినప్పుడు కాంగ్రెస్‌కు నొప్పి ఎందుకు వస్తోందని ప్రశ్నించారు.




2వ.

- రూ.250 కోట్లకుపైగా నిధులతో పనులు
- సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక పర్యవేక్షణ
- మేడారం జాతర ఏర్పట్లపై మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సీతక్క

## కుంభమేళాకు మించి సమ్మక్క-సారలమ్మ జాతర



2వ.

## వీధి కుక్కల బాధ్యత రాష్ట్రాలదే

- ఒక్క కరిచినా అందుకు బాధ్యత వహించాల్సిందే
- అందుకు విధించే జరిమానాలకు సిద్ధంగా ఉండండి
- వీధి కుక్కలకు ఆహారం పెట్టేవారు కూడా దోషులే
- ఘాటు హెచ్చరిక చేసిన సుప్రీం కోర్టు

ఏదైనా సంస్థ ఆహారం పెడుతున్న కుక్కల దాడిలో ఓ చిన్నారి మరణిస్తే.. అప్పుడు ఎవరిని బాధ్యుల్ని చేయాలి? ఆ ప్రాణనష్టానికి సదరు సంస్థ బాధ్యత వహించదా అని ప్రశ్నించింది. ఇక, వీధికుక్కలకు ఆహారం పెట్టే వారి గురించి మాట్లాడుతూ.. మీకు శునకాలపై అంత ప్రేమ ఉంటే.. వాటిని మీ ఇంటికి తీసుకెళ్లి పెంచుకోండి. వీధి కుక్కల సమస్య భావోద్వేగభరిత అంశమని అంటున్నారు.



2వ.

## ఆగని బంగారం పరుగులు

రోజురోజుకూ గరిష్ఠ ధరలు నమోదు

వేగుచుక్క

# కుంభమేళాకు మించి సమ్మక్క-సారలమ్మ జాతర



హైదరాబాద్: ఈనెల 28వ తేదీ నుండి 31 వ తేదీ వరకు జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు ఈసారి గతంకన్నా రెట్టింపు సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున ప్రభుత్వంలోని వివిధ శాఖలు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర మంత్రులు అడ్లూరి లక్షణ్ కుమార్, దనసరి అనసూయలు అన్నారు. మేడారం జాతరపై డా. బీ.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో మంత్రులు,అధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అరవింద్ కుమార్, సబ్యసాచి ఘోష్, అడిషనల్ డీజీలు విజయ్ కుమార్, స్వాతి లక్రా, వివిధ శాఖ కార్యదర్శులు, ములుగు జిల్లా కలెక్టర్ దివాకర తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్షణ్ కుమార్ మాట్లాడుతూ, గత 2024 మేడారం జాతరకు కోటిన్నర మంది హాజరుకాగా, ఈసారి 2026 లో జాతరకు దాదాపు గతంలో ఎన్నడూ లేనివిధంగా రూ. 150 కోట్ల నిధులను మంజూరు చేసి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నందున ఈసారి దాదాపు మూడు కోట్ల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నామని వివరించారు. సమ్మక్క?సారలమ్మ జాతరను కుంభమేళాకు మించి అద్భుతంగా నిర్వహించి, రాష్ట్ర ప్రభుత్వానికి జాతీయ స్థాయిలో మంచి పేరు తీసుకురావాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులకు పిలుపునిచ్చారు. ఈ మహాజాతరను విజయవంతంగా నిర్వహించడం ప్రతి అధికారికి ఒక బాధ్యతగా తీసుకుని, ఏ చిన్న లోపం కూడా లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆయన సూచించారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈ జాతరకు రూ.150 కోట్లకుపైగా నిధులు కేటాయించి అత్యంత ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. ఈ నిధులతో మౌలిక వసతులు, భద్రత, రవాణా, పారిశుద్ధ్యం, వైద్య సేవలు వంటి అన్ని విభాగాల్లో సమగ్ర ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. ఏ ఒక్క భక్తుడికి కూడా ఇబ్బంది కలగకూడదన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేసిన మంత్రి, జాతరకు వచ్చే భక్తులు సులభంగా గమ్యానికి చేరుకునేలా అన్ని ప్రధాన రహదారులు, అంతర్గత మార్గాల్లో స్పష్టమైన దిశా సూచిక బోర్డులు, బ్యానర్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులు ఎలాంటి అయోమయానికి గురికాకుండా ట్రాఫిక్ నియంత్రణ పటిష్టంగా ఉండాలని, ప్రత్యేక రూట్ మ్యాప్‌లతో పాటు అవసరమైన చోట వన్‌వే వ్యవస్థ అమలు చేయాలని సూచించారు. ఈ జాతరపై క్యాబినెట్ మొత్తం ప్రత్యేక దృష్టి సారించిందని, మంత్రులందరూ సమన్వయంతో పనిచేస్తూ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారని మంత్రి అడ్లూరి తెలిపారు. ఇలాంటి స్థాయి సమిష్టి పర్యవేక్షణ గతంలో ఎప్పుడూ జరగలేదని ఆయన పేర్కొన్నారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ సహా పలు రాష్ట్రాల నుంచి లక్షలాదిగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, అందుకు అనుగుణంగా వసతి, పార్కింగ్, రవాణా సౌకర్యాలను విస్తృతంగా ఏర్పాటు చేయాలని తెలిపారు. పార్కింగ్ విషయంలో వీఐపీలు,సామాన్య భక్తులు అనే తేడా లేకుండా, అందరికీ సమాన సౌకర్యాలు కల్పించాలని స్పష్టం చేశారు.

రాష్ట్ర పంచాయితీ రాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ, ఈసారి జాతర ఏర్పాట్లకు రూ. 150 కోట్లతో పాటు గద్దెల పునరుద్ధరణ పనులకు రూ. 101 కోట్లు మొత్తం 251 కోట్లను రాష్ట్ర ముఖ్యమంత్రి మంజూరు చేశారని వివరించారు. జాతరకు వచ్చే ప్రతీ భక్తులకు సాఫీగా దర్శనం లభించేలా ప్రాధాన్యత నిస్తున్నట్టు అన్నారు. ఇందుకు గాను ప్రతీ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. రాష్ట్ర స్థాయిలో వివిధ శాఖ కార్యదర్శులు, హెచ్.ఓ.డీ లతో ప్రత్యేకంగా వాట్స్-అప్ గ్రూప్ ను ఏర్పాటు చేసి జాతర నిర్వహణపై ప్రత్యేకంగా పర్యవేక్షించాలని సీతక్క సూచించారు. శానిటేషన్, తాగునీరు, రవాణా, భద్రతాలపై ప్రత్యేకంగా ద్రుష్టి సారించాలని, ప్రధానంగా టాయిలెట్ లను మరింత పెంచాలని కోరారు. జాతర సందర్భంగా గురు, శుక్ర వారాల్లోనే ప్రతి రోజు కనీసం 40 లక్షల మంది భక్తులు ఉంటారని, ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. మేడారం జాతరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2010 నుండి ప్రతీ సంవత్సరం వస్తున్నారని, వచ్చే వందేళ్లకు సరిపడా అభివృద్ధి కార్యక్రమాలకు మొట్టమొదటిసారిగా పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశారని సీతక్క గుర్తు చేశారు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామ కృష్ణ రావు మాట్లాడుతూ, జాతర నిర్వహణ ఏర్పాట్లపై రాష్ట్ర ముఖ్యమంత్రి నిరంతరం పర్యవేక్షిస్తున్నందున అన్ని శాఖల ఉన్నతాధికారులు జాతర పనులకు సకాలంలో పూర్తయ్యేలా ప్రత్యేక దృష్టి సాధించాలని పేర్కొన్నారు. జాతర సందర్భంగా భక్తులకు చేసిన ఏర్పాట్లు, రవాణా, ఇతర సౌకర్యాలు, భక్తులు పాటించాల్సిన సూచనలపై విస్తృత స్థాయిలో సమాచారాన్ని అందించాలని తెలిపారు. మేడారానికి వచ్చే ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ నియంత్రణకుగాను డ్రోన్ లను ఉపయోగించుకోవాలన్నారు. అదేవిధంగా, జాతర సమాచారాన్ని, నియమ నిబంధనలను తెలియచేసే ప్రత్యేక యాప్ ను/ క్యూ.ఆర్ కోడ్ రూపొందించి విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు. పార్కింగ్ ఏరియాలలో కూడా ప్రత్యేకంగా వాటర్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. శానిటేషన్, పరిశుభ్రతపై ప్రత్యేక ద్రుష్టి సాధించాలన్నారు. ప్రస్తుతం మేడారంలో జరుగుతున్న జాతర ఏర్పాట్లు, పురోగతి తదితర విషయాలను తెలియచేసే నివేదికను ప్రతీ రోజూ తమకు సమర్పించాలని సంబంధిత శాఖల కార్యదర్శులను కోరారు. ఈ సందర్భంగా, మేడారం జాతరకు వివిధ శాఖలు చేస్తున్న ఏర్పాట్లు, చేపట్టిన పనులు, వాటి పురోగతి పై ములుగు జిల్లా కలెక్టర్ దివాకర పవర్ పాయింట్ ప్రసెంటేషన్ ద్వారా వివరించారు. ఈసారి జాతరకు దాదాపు మూడు కోట్ల మంది హాజరవుతారని అంచనా వేసినట్లు తెలిపారు. తదితర ప్రారంభానికి ముందే దాదాపు 30 శాతం భక్తులు సందర్శిస్తారని అన్నారు. జాతర సమయంలో 60 శాతం నుండి 65 శాతం వరకు, జాతర అనంతరం 5 శాతం భక్తులు మేడారం సందర్శిస్తారని వివరించారు. మేడారం జాతరపై ములుగు జిల్లా యంత్రాంగం రూపొందించిన ప్రత్యేక లోగో, యాప్, వీడియోలను మంత్రులు సీతక్క, లక్షణ్ కుమార్, సి.ఎస్ రామకృష్ణరావులు ఆవిష్కరించారు.

## మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల తుదిజాబితా ప్రకటన




హైదరాబాద్: తెలంగాణలో త్వరలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం తుది ఓటర్ల జాబితాను ప్రకటించింది. ఎన్నికలు జరగనున్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో 52,43,023 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించింది. వీరిలో 25,62,369 మంది పురుష ఓటర్లు కాగా.. 26,80,014 మంది మహిళా ఓటర్లు, 640 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉన్నారు. పట్టణ స్థానిక సంస్థల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉండటం గమనార్హం. నిజామాబాద్ కార్పొరేషన్‌లో అత్యధికంగా 3,48,051 మంది ఓటర్లు ఉండగా.. కొత్తగూడెం కార్పొరేషన్‌లో అత్యల్పంగా 1,34,775 మంది ఓటర్లు ఉన్నారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీలో అత్యధికంగా 1,43,655 మంది ఓటర్లు ఉండగా.. అమరచింత మున్సిపాలిటీలో అత్యల్పంగా 9,147 మంది ఓటర్లు ఉన్నారు. రాష్ట్రంలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల కోసం పురపాలకశాఖ కసరత్తు ముమ్మరం చేసింది. రిజర్వేషన్లు ఖరారైన తర్వాత నోటిఫికేషన్ విడుదల కానుంది. జనాభా ప్రాతిపదికన వార్డులు, డివిజన్లు, ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల రిజర్వేషన్లను ఖరారు చేయనున్నారు. మొత్తం ఎన్నికల పర్వంలో రిజర్వేషన్ల ప్రక్రియ అత్యంత కీలకం కావడంతో అధికారులు దీనిని సకాలంలో పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నారు. రాష్ట్రంలో గడువు ముగిసిన 117 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్ల ఎన్నికలకు రంగం సిద్ధమైన సంగతి తెలిసిందే.

# వీధి కుక్కల బాధ్యత రాష్ట్రాలదే



న్యూఢిల్లీ: వీధి కుక్కల అంశంపై సుప్రీంకోర్టు మరోసారి కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ వ్యవహారంపై మంగళవారం విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం.. కుక్కల బెడదను అరికట్టేందుకు చర్యలు తీసుకోకపోతే ఆయా రాష్ట్రాలపై భారీ జరిమానాలు వేస్తామని హెచ్చరించింది. ప్రతి కుక్క కాటు కు పరిహారం చెల్లించాల్సిందేనని స్పష్టంచేసింది. వీధి కుక్కల బెడదను నివారించేందుకు రాష్ట్రాలు తగిన చర్యలు చేపట్టాలి. లేదంటే ప్రతి కుక్క కాటుకు, కుక్కల దాడిలో జరిగిన ప్రతి మరణానికి గానూ ఆయా రాష్ట్రాలపై మేం నిర్దేశించిన భారీ పరిహారాలను చెల్లించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. కుక్క కరిచిన ప్రభావం బాధిత వ్యక్తిపై జీవితకాలం ఉంటుందని న్యాయస్థానం పేర్కొంది. ఈ సందర్భంగా వీధి కుక్కలకు ఆహారం పెడుతున్న వారిపైనా కోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఏదైనా సంస్థ ఆహారం పెడుతున్న కుక్కల దాడిలో ఓ చిన్నారి మరణిస్తే.. అప్పుడు ఎవరిని బాధ్యుల్ని చేయాలి? ఆ ప్రాణనష్టానికి సదరు సంస్థ బాధ్యత వహించదా అని ప్రశ్నించింది. ఇక, వీధికుక్కలకు ఆహారం పెట్టే వారి గురించి మాట్లాడుతూ.. మీకు శునకాలపై అంత ప్రేమ ఉంటే.. వాటిని మీ ఇంటికి తీసుకెళ్లి పెంచుకోండి. వీధి కుక్కల సమస్య భావోద్వేగభరిత అంశమని అంటున్నారు. మీ భావోద్వేగం కేవలం కుక్కల పైన మాత్రమేనా? మేం మనుషుల గురించి కూడా సమానంగా ఆందోళన చెందుతున్నాం. కుక్కలు వీధుల్లో తిరుగుతూ ప్రజలను భయపెట్టే పరిస్థితిని మేం ఆమోదించబోం అని ధర్మాసనం వెల్లడించింది. దేశవ్యాప్తంగా వీధి కుక్కల దాడుల ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో గతేడాది నవంబరులో సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. విద్యాసంస్థలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, క్రీడా సముదాయాలు, ఇతర బహిరంగ ప్రదేశాల సమీపంలోని వాటిని షెల్టర్లకు తరలించాలని ఆదేశించింది. ఈ అంశంపై సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతోంది.

# కవితను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే అవకాశం లేదు

హైదరాబాద్: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారంటూ కొద్దిరోజులుగా వస్తున్న వార్తలపై పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తోసిపుచ్చుతూ.. అలాంటిదేమీ లేదని అన్నారు. మంగళవారం నాడు మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. కవితను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే అవకాశమే లేదని స్పష్టం చేశారు. తెలంగాణాలో బీఆర్ఎస్ పార్టీకి గతం తప్ప.. భవిష్యత్తు లేదంటూ వ్యాఖ్యానించారు. కేసీఆర్ కుటుంబ అవినీతి గురించి కవిత నిజాలు చెప్తున్నారన్నారు. తాము చేసిన ఆరోపణలపై కవిత సమాధానం రూపంలో రుజువైందని చెప్పారు. కవిత మాటలతో కేసీఆర్ అవినీతి నిజమని ప్రజలు అర్థం చేసుకుంటున్నారని ఆయన చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణా ప్రయోజనాలే ముఖ్యమని.. ఒక్క నీటిబొట్టును కూడా వదలమని తేల్చిచెప్పారు. అజారుద్దీన్, కోదండరామ్ ఎమ్మెల్సీల విషయంలో మంచి స్పందన వస్తోందని నమ్ముతున్నట్లు తెలిపారు. ఏప్రిల్‌లో కార్పొరేషన్ ఛైర్మన్లను భర్తీ చేస్తామని ప్రకటించారు. పదవులు తక్కువ అయ్యాయని... ఆశావహులు ఎక్కువ అయ్యారని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల కోసం పార్టీ తరఫున ఒక కమిటీ వేస్తామని.. సర్వేల ఆధారంగా టికెట్ల ఇస్తామని చెప్పారు. గెలిచే అభ్యర్థులకే టికెట్ ఇస్తామని మహేశ్ కుమార్ పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పొత్తుపై పీఏసీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. బీజేపీని తెలంగాణాలో నమ్మే పరిస్థితి లేదన్నారు మహేశ్ కుమార్. మత రాజకీయాలు రాష్ట్రంలో నడవవని అన్నారు. రాముడికి, బీజేపీకి సంబంధమేంటి అని ఆయన ప్రశ్నించారు. తాము హిందూ ఆచారాలను పాటిస్తామని.. కానీ హిందూ సెంటిమెంట్‌తో ఓట్లు అడగమని తెలిపారు. తనకు, సీఎం రేవంత్ మధ్య మంచి సాన్నిహిత్యం ఉందన్నారు పీసీసీ చీఫ్. మంత్రులకు, సీఎంకు మధ్య ఎలాంటి గ్యాప్ లేదని మహేశ్ తేల్చిచెప్పారు. ఇతర మంత్రుల శాఖల్లో ముఖ్యమంత్రి తలదూర్చరన్నారు. మంత్రులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నారని వెల్లడించారు. డీ సెంట్రలైజేషన్ కోసమే మేడారంలో క్యాబినెట్ సమావేశం ఏర్పాటు చేస్తున్నారని పీసీసీ చీఫ్ తెలిపారు. కేసీఆర్.. కుమారుడికి ఒక జిల్లా, కూతురికి ఒక జిల్లా, అల్లుడికి ఒక జిల్లా ఇచ్చారని పీసీసీ చీఫ్ ఆరోపణలు గుప్పించారు. కేసీఆర్ అశాస్త్రీయంగా జిల్లాలను విభజించారని మండిపడ్డారు. శాస్త్రీయంగా జిల్లాల పునర్విభజన చేయాలని కమిటీ వేస్తున్నామని తెలిపారు. సికింద్రాబాద్‌ను ఎవరు ముట్టుకున్నారని తలసాని శ్రీనివాస్ యాదవ్ గాబరాపడుతున్నారని ప్రశ్నించారు. వ్యక్తిగత జీవితాలతో ఆడుకునే హక్కు ఎవరికీ లేదన్నారు. మహిళా అధికారులపై ఆధారాలు లేకుండా వార్తలు రాస్తే ఎంత ఇబ్బంది పడతారో అర్థం చేసుకోవాలన్నారు. సోషల్ మీడియాను కట్టడి చేయాలన్నారు. పదేళ్లలో వచ్చిన ఉద్యోగాలు ఎన్ని.. రెండేళ్లలో ఇచ్చిన ఉద్యోగాలు ఎన్నో నిరుద్యోగులు అర్థం చేసుకోవాలని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## గాంధీపేరుతో కాంగ్రెస్ నీచ రాజకీయం

కరీంనగర్: ఉపాధి హామీ పథకం పేరు మార్చడంపై కాంగ్రెస్ చేస్తున్న రాజకీయాన్ని నీచ రాజకీయంగా కేంద్రమంత్రి బండి సంజయ్ అభివర్ణించారు. వాల్మీకీ-అంబేద్కర్ ఆవాస్ యోజన (వాంబే) పేరుతో వాజ్‌పేయి తీసుకొచ్చిన ఇండ్ల పథకాన్ని కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎందుకు తీసేశారని ప్రశ్నించారు. వాల్మీకీ, అంబేద్కర్ పేర్లు తొలగించి ఇందిరా ఆవాస్ యోజనగా ఎందుకు మార్చారని, ఇది ఆ మహానుభావులను అవమానించడం కాదా అని విమర్శించారు. అలాగే గతంలో ఎన్టీఆర్ టెర్మినల్‌గా ఉన్న హైదరాబాద్ విమానాశ్రయ టెర్మినల్ పేరును తీసేసి రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుగా ఎందుకు మార్చారని బండి సంజయ్ ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలపై తీవ్ర విమర్శలు గుప్పించిన ఆయన.. గాంధీ పేరును వాడుకున్నారే తప్ప మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని కాంగ్రెస్ నేతలు పాతరేసి ఆయన ఆత్మను క్షోభకు గురిచేశారని ఆరోపించారు. వారసత్వ రాజకీయాలను గాంధీ వ్యతిరేకించారని గుర్తుచేశారు. అలాగే ఆయన పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ వ్యాఖ్యలపై స్పందించారు. రాముడి బాటలో నడుస్తామని, రాముడి ఆలయాలను నిర్మిస్తామని తాము చెప్పినప్పుడు కాంగ్రెస్‌కు నొప్పి ఎందుకు వస్తోందని ప్రశ్నించారు. దేశంలో అనేక పథకాలు కేంద్ర,రాష్ట్ర భాగస్వామ్యంతోనే నడుస్తున్నాయని, ఈ పథకానికి రాష్ట్ర భాగస్వామ్యం కల్పిస్తే తప్పేముందని నిలదీశారు. ఉపాధి కూలీల వేతనాలను కూడా సకాలంలో ఇవ్వలేని కాంగ్రెస్ నేతలు మాట్లాడటం విడ్డూరమని విమర్శించారు. కరీంనగర్ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించిందని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. కరీంనగర్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. అర్బన్ ఇన్‌ఫ్రాస్టక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు మొత్తం రూ.50 కోట్లు విడుదల చేసినట్లు ఆయన వెల్లడించారు. ఇందులో కేంద్ర వాటా రూ.40 కోట్లు ఉన్నట్లు పేర్కొన్నారు.

# మళ్లీ మొదలైన రాజధాని రగడ

అమరావతి: ఇటీవల మాజీ సిఎం, వైకాపా అధినేత జగన్ వ్యాఖ్యలతో మరోమారు రాజధాని రగడ రాజుకుంది. అమరావతిని రివర్ బేసిన్‌లో నిర్మిస్తున్నారని జగన్‌తో పాటు, ఆయన అనుచరగణం చేస్తున్న విమర్శలను అధికార పార్టీ నేతలు గట్టిగా తిప్పికొడుతున్నారు. నదీ పరీవాహక ప్రాంతంలో రాజధానిని నిర్మించడం ఏమిటని జగన్ ప్రశ్నిస్తున్నారు. నదులకు, నాగరికతకు మధ్య విడదీయరాని బంధం అనాదిగా ఉందన్న విషయం జగన్‌కు తెలియదని సిఎం చంద్రబాబు ఎదురుదాడికి దిగారు. నదులు ఉన్న చోటే నాగరికత వెల్లివిరిసింది. ప్రపంచంలో అనేక మహా నగరాలు నదీ తీరాలలోనే నిర్మితమయ్యాయి. అనేక నగరాల మధ్య నుంచి నదులు ప్రవహిస్తున్నాయి. అమెరికా ఆర్థిక రాజధానిగా పేరొందిన న్యూయార్క్ నగరం హడ్సన్ నదీ తీరం వెంబడి నిర్మితం కాలేదా? సీన్ నదీ తీరం వెంట ఫ్రాన్స్ రాజధాని ప్యారిస్, ఇంగ్లండ్ రాజధాని లండన్ నగరం థేమ్స్ నదీ తీరం వెంట, ఇటలీ రాజధాని రోమ్ నగరం టైబర్ నది వెంట, నైలు నదీ తీరంలో ఈజిప్టు రాజధాని కైరో, చైనాలోని షాంఘై నగరం యాంగ్జి నదీ తీరం వెంట నిర్మితమైనవే కదా అని ఘాటుగా సమాధానం ఇచ్చారు. ఇదే సందర్భంలో సింధూనాగరికత గురించి జగన్ తెలుసుకోవాలన్నారు. తరచుగా లండన్ వెళ్లే జగన్ రెడ్డి అక్కడ థేమ్స్ నదిని చూసే ఉంటారు కదా అని టిడిపి శ్రేణులు విమర్శలకు దిగారు. అంతెందుకు గోల్కొండ నవాబులు హైదరాబాద్ నగరాన్ని మూసీ నది ఒడ్డునే నిర్మించారు కదా అన్నారు. అయితే 2019కి ముందు జగన్ మాట్లాడిన మాటలకు ఇపపుడు మాట్లాడే మాటలకు పొంతన లేకుండా ఉంది. సిఎం ఎక్కడ ఉంటే అదే రాజధాని అంటున్నారు. తాగునీటి అవసరాలు తీరడానికి రాజధాని నదీ తీరంలో నిర్మించాలని గతంలో చెప్పిన విషయాన్ని విస్మరించారు. రాష్ట్రానికి మధ్యలో రాజధాని ఉండాలని, కనీసం 30 వేల ఎకరాల భూమి ఉండాలని, అమరావతిని రాజధానిగా ప్రకటించినందున తాను కూడా తాడేపల్లిలో ఇల్లు నిర్మించుకున్నానని చెప్పారు. 2019లో అధికారంలోకి రాగానే రాజధానిని ఒక కులం వారి కోసమే కడుతున్నారని నిందలు వేసారు. అమరావతిని శ్మశానంతో, ఎడారితోనూ పోల్చారు. భూములు ఇచ్చిన రైతులను అనేక విధాలుగా వేధించి అవమానాలకు గురిచేశారు. ఇప్పుడు రివర్ బేసిన్ అనే కొత్త రాగం అందుకున్నారు. తాను అమరావతిని రాజధానిగా వ్యతిరేకిస్తున్నానని స్పష్టంగా చెప్పారు. అమరావతి నిర్మాణాన్ని ఏదో ఒక విధంగా అడ్డుకోవాలన్నదే జగన్ నిర్ణయంగా ఉందని తెలుస్తోంది. అందుకే రాష్ట్ర శాశ్వత రాజధానిగా అమరావతిని ప్రకటించకుండా అడ్డుకొనే ప్రయత్నాలకు తెరలేపారు. అందులో భాగంగానే రివర్ బేసిన్ అనే వాదాన్ని తెరమీదకు తెచ్చారు.

ఉమ్మడి ఎపి విభజన జరిగిన పదకొండున్నర సంవత్సరాల తర్వాత రాజధాని నిర్మాణం చర్చనీయాంశంగా మార్చాలని చూస్తున్నారు. తన ఐదేళ్ల పాలనలో జగన్ రాజధాని లేకుండా చేశారు. అమరావతి విషయంలో సజ్జల రామకృష్ణా రెడ్డి జగన్ వ్యాఖ్యలను సానుకూలంగా మార్చే యత్నం చేశారు. గత ఎన్నికల్లో పదకొండు సీట్లకే పరిమితమైనప్పటికీ రాజధాని విషయంలో ఆయన వైఖరి మారలేదని ఇప్పుడు స్పష్టమైంది. రాజధాని అవసరమే లేదని చెబుతున్న జగన్ ,ముఖ్యమంత్రి చంద్రబాబుకు బుద్ధీ జ్ఞానం లేవని ఆరోపించారు. అయితే అమరావతిని అద్భుతమైన నగరంగా నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కలలు కంటున్నారు. దక్షిణాదికే తలమానికంగా రాజధాని నిర్మాణం కావాలని చంద్రబాబు ఉబలాట పడుతున్నారు. విమర్శలు ఎలా ఉన్నా ఇక ఉన్నది మూడేళ్ల కాలమే. ఈ లోగా రాజధాని నిర్మాణం పూర్తి చేసి తన సత్తా ఏమిటో చాటాలి. వీలైనంత త్వరగా రాజధానిలో పౌర సౌకర్యాలు కల్పించడంతో పాటు నిర్మాణాలను పూర్తి చేయాలి. అమరావతిని ఆవాసయోగ్యంగా మార్చగలిగితే ఎవరు అధికారంలో ఉన్నా అభివృద్ధి దానంతటదే జరుగుతుంది. ప్రభుత్వ భవనాల నిర్మాణం పూర్తి చేయడం ఎంత ముఖ్యమో ఇళ్ల నిర్మాణం జరగడం కూడా అంతే ముఖ్యం. రాజధాని అంటే కార్యాలయాలు మాత్రమే కాదు, ప్రజలతో కళకళలాడాలి. ఇందుకోసం ఇళ్ల నిర్మాణాలను ప్రోత్సహించాలి. ఆవాస ప్రాంతాలలో పౌర సౌకర్యాల కల్పనకు ప్రాముఖ్యతను ఇవ్వాలి. ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలి. అప్పుడే జనసాంద్రత పెరుగుతుంది.


# గ్రామాల్లో మొదలైన సంక్రాంతి సందడి



విజయవాడ:సంక్రాంతి అంటేనే సంబరాల పండుగ. ఇంటింటా పిండివంటల సువాసనలు, ముంగిట ముగ్గులు, ఆకాశంలో రంగురంగుల గాలిపటాలు, వీధుల్లో హరిదాసుల గానాలు.. ఈ అన్నింటితో గ్రామాలు కళకళలాడిపోతుంటాయి. సంక్రాంతి సందడితో ఇప్పుడు ఎపిలోని గ్రామాలు సందడిగా మారాయి. అప్పుడే గ్రామాల్లో కొత్త శోభ కనిపిస్తోంది. ముగ్గులు, గొబ్బెమ్మలు ఆకర్శణ్యయంగా దర్శనమిస్తున్నాయి. పట్టణాల నుంచి వచ్చిన వారితో గ్రామాల్లో పలకరింపులు, ముచ్చట్లు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా కోస్తా జిల్లాల్లో సంక్రాంతి సందడి ఊపందుకుంది. బసవన్న విన్యాసాలు, కర్రసాము, కత్తిసాము, డప్పు కళాకారులు హోరెత్తించే ప్రదర్శనలు, కోలాటం, పులివేషాలు.. ఇలా ప్రతి మూలా ఓ సంబరం కనిపిస్తుంటుంది. అన్నింటికీ మించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచేది కోడి పందేలు. గ్రామీణ సంస్కృతిలో కోడి పందేలు, ఎడ్ల పందేలు కేవలం ఆటలు మాత్రమే కావు. అవి ఓ ఉత్సవం, ఓ వేడుకలా సాగుతాయి. ఈవీటి కోసం అప్పుడే బరులు సిద్ధం చేసుకున్నారు. భోగి నుంచి కనుమ వరకూ పల్లెల్లో జరిగే ఈ పందేలను చూడటానికి చుట్టుపక్కల గ్రామాల నుంచే కాదు.. ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచీ జనం పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ముఖ్యంగా ఉభయ గోదావరి జిల్లాల్లో జరిగే కోడి పందేలు దేశవ్యాప్తంగా మాత్రమే కాకుండా.. విదేశాల్లో ఉన్న తెలుగువారిలోనూ ప్రత్యేక గుర్తింపు పొందాయి. అక్కడి పందేల హడావిడి, ఏర్పాట్లు, గెలుపు ఓటముల ఉత్కంఠ ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. కొందరికి ఇది సంప్రదాయం, మరికొందరికి వినోదం, ఇంకొందరికి గెలుపు ఓటముల ఉత్కంఠ. ఈ పందేలతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక ఉత్సాహం కనిపిస్తుంది. అయితే.. ఇటీవలి కాలంలో కోడి పందేల్లో మనుషులు గాయపడటం, ప్రాణాలు కోల్పోవడం వంటి ఘటనలు పెరుగుతున్నాయి. కోడి కత్తులు ప్రేక్షకులకు తగలడం, గొడవలు జరగడం.. దీనివల్ల దాడులకు దిగడం వంటి ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ఈ సంప్రదాయం ఇప్పుడు భద్రతా కోణంలో పెద్ద చర్చకు దారితీస్తోంది. కాబట్టి ఈ కోడి పందేల విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు.

# ఆగని బంగారం పరుగులు

## రోజురోజుకూ గరిష్ఠ ధరలు నమోదు



న్యూఢిల్లీ:వరుసగా పెరుగుతూ వస్తున్న బంగారం, వెండి ధరలు మంగళవారం కూడా భారీ పెరుగుదల నమోదు చేశాయి. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడంతో బంగారం, వెండిపై మదుపర్లు దృష్టి సారిస్తున్నారు. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి క్షీణిస్తుండడం కూడా బంగారం, వెండి ధరల డిమాండ్‌కు కారణంగా కనిపిస్తోంది.

ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం 6:30 గంటల సమయంలో హైదరాబాద్‌లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1,42,160కి చేరింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,30,310కి చేరింది. ఇక, దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి రేటు రూ. 1,42,310కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ ధర రూ. 1,30,460కి చేరుకుంది. మరోవైపు వెండి కూడా భారీగా పెరిగింది. ఈ నేపథ్యంలో దేశంలోని పలు ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు అమాంతంగా పెరిగాయి.

# ప్రారంభానికి సిద్దంగా ప్రధాని కార్యాలయం

న్యూఢిల్లీ: ఢిల్లీలో ప్రతిష్టాత్మక సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన ప్రధానమంత్రి కొత్త కార్యాలయం ప్రారంభానికి సిద్ధమైంది. రైసినా హిల్ సమీపంలో అత్యాధునిక సౌకర్యాలతో రూపుదిద్దుకున్న ఈ భవన సముదాయంలోకి ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెలలోనే మారే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. నిర్మాణ దశలో 'ఎగ్జిక్యూటివ్ ఎన్‌క్లేవ్' గా పిలిచిన ఈ సముదాయానికి కేంద్ర ప్రభుత్వం 'సేవా తీర్థ్' అని నామకరణం చేసింది. ఈ ప్రాంగణంలో మొత్తం మూడు మెయిన్ బిల్డింగులు ఉన్నాయి. ఒకదాంట్లో ప్రధానమంత్రి కార్యాలయం(పీఎంవో) ఉంటుంది. రెండో భవనం నుంచి కేబినెట్ సెక్రటేరియెట్ విధులు సాగుతాయి. మూడో భవనంలో జాతీయ భద్రతా మండలి సెక్రటేరియట్(ఎన్ఎస్‌సీఎస్)తో పాటు జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్ కార్యాలయం ఉంటుంది. కొత్త కార్యాలయంలో విదేశీ ప్రముఖులు, అతిథులతో సమావేశమయ్యేందుకు వీలుగా హై-ఎండ్ రూమ్‌లను రూపొందించారు. ఇవి అత్యాధునిక సాంకేతికతను కలిగి ఉండటమే కాకుండా.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఉన్నాయి. ముఖ్యంగా కేబినెట్ సమావేశాల కోసం ఒక హాలును సిద్ధం చేశారు. అధికారుల మధ్య సమన్వయం పెంచేందుకు 'ఓపెన్ ఫ్లోర్' మోడల్‌ను ఇక్కడ అమలుచేస్తున్నారు. కాగా.. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ప్రధానమంత్రి కార్యాలయం సౌత్ బ్లాక్ నుంచే పనిచేస్తున్నది. తాజా మార్పుతో దశాబ్దాల చరిత్రకు తెరపడనుంది. నార్త్ బ్లాక్, సౌత్ బ్లాక్‌లలో ఉన్న హోం, ఫైనాన్స్, విదేశీ వ్యవహారాలు, రక్షణ శాఖలు ఇప్పటికే కొత్తగా నిర్మించిన 'కర్తవ్య భవన్' కు తరలివెళ్లాయి. ఖాళీ అయిన ఈ పురాతన కట్టడాలను భారీ మ్యూజియంగా మార్చనున్నారు. సేవా తీర్థ్ సమీపంలోనే ప్రధాని కొత్త నివాసం కూడా నిర్మాణం అవుతున్నది. ప్రస్తుతం 7 లోక్ కల్యాణ్ మార్గ్‌లో ఉన్న ప్రధాని నివాసాన్ని కూడా అక్కడికే మార్చనున్నారు.

# 55 ఏళ్లకు రోడ్డు పనులకు మోక్షం

## పనులు పూర్తి కావడంతో గ్రామస్థుల హర్షం

పార్వతీపురం: బలిజిపేట మండల కేంద్రంలోని కొత్తగళావల్లి గ్రామంలో 55 ఏళ్ల తర్వాత రోడ్డు నిర్మాణ పనులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఆ గ్రామస్థుల దశాబ్దాల నాటి కల ఎట్టకేలకు నెరవేరింది. తారురోడ్డు నిర్మాణ పనులు మంగళవారం పూర్తి కావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొత్తగళావల్లి ప్రజలు దాదాపు 55 ఏళ్ల నుంచి రోడ్డు కావాలని అధికారులకు విన్నవించుకున్నారు. ఇప్పటివరకు ఎవరూ రోడ్డు నిర్మాణానికి ముందుకు రాలేదు. ఈ విషయాన్ని తెదేపా నేత, స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన ఏడాది క్రితం రెండు కిలోమీటర్ల మేర తారురోడ్డు, కల్వర్టు నిర్మాణానికి రూ.2 కోట్లు నిధులను మంజూరు చేయించారు. దీంతో ఈ పనులు నేటితో పూర్తవడంతో గ్రామస్థులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే విజయచంద్ర మంగళవారం వెంగాపురంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన 'ఐ లవ్ వెంగాపురం' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బలిజిపేట మండలంలోని అనుసంధాన రోడ్లతో పాటు గ్రామీణ రహదారులన్నింటినీ అభివృద్ధి చేస్తానన్నారు.

# చట్టం పత్రిక, టీవీ తెలుగు రాష్ట్రాలలో విస్తరణ గర్వకారణం.

## - మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్.



**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్:**

జిల్లా నుంచి ఆవిర్భవించిన చట్టం తెలుగు దినపత్రిక, చట్టం టీవీ, సోషల్ మీడియా వేదికలుగా రాష్ట్రవ్యాప్తంగా విస్తరించడం ఎంతో గర్వకారణమని మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ తెలిపారు. ప్రతి సంవత్సరం తన చేతుల మీదుగా చట్టం క్యాలెండర్‌ను ఆవిష్కరించే అవకాశం లభించడం తనకు ఎంతో ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు. చట్టం టీవీ, చట్టం డైలీ పత్రిక, సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ, నిష్పక్షపాతమైన వార్తలను ప్రజలకు చేరవేస్తుండటం అభినందనీయమని అన్నారు. జిల్లా స్థాయి నుంచి ప్రారంభమైన ఈ మీడియా సంస్థ తెలుగు రాష్ట్రాలలో తన ప్రత్యేక గుర్తింపును సంపాదించుకోవడం వెనుక చట్టం సంపాదకులు సిరిగాద ప్రసాద్ కృషి ఎంతో ఉందని కొనియాడారు. ప్రసాద్ నిరంతర శ్రమతో పాటు, చట్టం టీవీకి మద్దతుగా నిలుస్తున్న వీక్షకులు, పాఠకులు, శ్రోతల సహకారం కూడా ఈ విజయానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చట్టం తెలుగు దినపత్రిక , చట్టం టీవీని ఆదరిస్తున్న ప్రతి ఒక్కరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే రోజుల్లో చట్టం టీవీ, పత్రిక, డిజిటల్ మీడియా మరింత దినదినాభివృద్ధి చెందుతూ, రాష్ట్ర స్థాయిలో ఉన్న ప్రముఖ పత్రికలు, మీడియా సంస్థల సరసన నిలవాలని ఆకాంక్షించారు. ప్రజల సమస్యలపై మరింత ప్రభావవంతంగా స్పందిస్తూ, ప్రజల గొంతుకగా చట్టం మీడియా ముందుకు సాగాలని కోరారు. ఈ సందర్భంగా చట్టం టీవీని ఆదరిస్తున్న వీక్షకులు, పాఠకులు, శ్రోతలందరికీ మరోసారి కృతజ్ఞతలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా ఇదే ఆదరణ కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ తో పాటు సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

# అధికార ప్రతినిధి ఒత్తిళ్లకు అధికారులు తలొగ్గారు.

## - మేయర్ పీఠం కోసమే ఓట్ల గందరగోళం.



**- అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ.**

వేగుచుక్క న్యూస్, నిజామాబాద్: మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంటుందనే భయంతోనే పాలక పక్షం ఓటర్ల జాబితాను తారుమారు చేస్తోందని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ దిలీప్ కుమార్‌తో భేటీ అయ్యారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో చోటుచేసుకున్న అక్రమాలు, పొరపాట్లపై చర్చించి, అభ్యంతరాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఒక వార్డులోని ఓటర్లను కావాలనే మరో వార్డులోకి మార్చారని, అర్హులైన వేలాది మంది ఓట్లను జాబితా నుంచి తొలగించారని ఆరోపించారు. స్థానిక అధికార ప్రతినిధి కనుసైగల్లోనే అధికారులపై ఒత్తిడి తెచ్చి ఈ ముసాయిదాను 'తప్పుల తడక'గా తయారు చేయించారని విమర్శించారు. "మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని సర్వేలు చెబుతుండటంతో, ఓటమి భయంతో అధికార పార్టీ అడ్డదారులు తొక్కుతోందని, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరగకుండా అధికారులు పాలక పక్షానికి తొత్తులుగా మారడం సరికాదు" అని ఎమ్మెల్యే మండిపడ్డారు. క్షేత్రస్థాయిలో మరోసారి విచారణ జరిపి, తప్పులను సరిదిద్దాలని, వార్డుల వారీగా ఓటర్ల విభజన శాస్త్రీయంగా ఉండాలని, ఓటర్ల జాబితాను సరిదిద్దకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని, అవసరమైతే న్యాయపోరాటం చేస్తామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

# కలెక్టరేట్‌లో సంక్రాంతి ముగ్గుల పోటీలు.










**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి:**

టీఎన్జీవోస్ కామారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో మంగళవారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. కలెక్టరేట్‌న లోని అన్ని శాఖల మహిళా ఉద్యోగులకు సంక్రాంతి ముగ్గుల పోటీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్లు విక్టర్, మధుమోహన్ ముఖ్య అతిథులుగా హాజరు అయ్యారు. మహిళా ఉద్యోగులు వేసిన ముగ్గులకు గాను మొదటి బహుమతి శాంభవి, శాంతి విద్యా శాఖ వారికి, ద్వితీయ బహుమతినీ రోజా రాణి, రవళి రెవెన్యూ శాఖ, అదేవిధంగా గౌతమి, అరుణ మత్స్యశాఖ వారు గెలుచుకోవడం జరిగినది. అదేవిధంగా తృతీయ బహుమతిని ప్రియాంక, పద్మ ఆడిట్, చీఫ్ ప్లానింగ్ శాఖ పొందడం జరిగింది. పోటీలో పాల్గొన్న మహిళా ఉద్యోగుల ప్రతి ఒక్కరికి కన్సోలేషన్ బహుమతి అందించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్ మాట్లాడుతూ, టీఎన్జీవోస్ కామారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించడం ఆనందదాయకమని, అదేవిధంగా మహిళా ఉద్యోగులు అన్ని రంగాల్లో ముందు ఉండి జిల్లా కార్యాలయాల్లో వారి పనులను సంతృప్తికరంగా నిర్వహించుకుని జిల్లాకు మంచి పేరును తీసుకురావాలని కోరారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ మధుమోహన్ మాట్లాడుతూ, టీఎన్జీవోస్ జిల్లా శాఖ ప్రతి సంవత్సరం ముగ్గుల పోటీలు నిర్వహించడం ఒక మంచి సాంప్రదాయమని, ముగ్గుల పోటీలలో పాల్గొన్నటువంటి ఉద్యోగులకు అదేవిధంగా జిల్లా ఉద్యోగులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నరాల వెంకట్ రెడ్డి, కార్యదర్శి ముల్క నాగరాజు, కోశాధికారి ఎం. దేవరాజు, ఉపాధ్యక్షులు రాజ్యలక్ష్మి, ఎంసీ పోచయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ సంతోష్ కుమార్, కల్చరల్ సెక్రటరీ రాజ్ కుమార్, ఈసీ నెంబర్లు సాయినాథ్, లక్ష్మణ్ మరియు దత్తాద్రి, అర్బన్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్ రెడ్డి, సృజన్, తదితరులు పాల్గొన్నారు..

# జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు: కలెక్టర్.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, జనవరి 13**



: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కలెక్టర్ ఇలా త్రిపాఠి జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. భోగభాగ్యాలనిచ్చే భోగి, సరదాలు పంచే సంక్రాంతి వేడుక ప్రజలందరికీ ఆనందం పంచాలని ఆకాంక్షించారు. నూతన సంవత్సరంలో శుభాలు సమకూరాలని, అనుకున్న కార్యాలన్నీ నెరవేరాలని, ఏడాది పొడుగునా ఇంటింటా సిరుల కాంతులు విలసిల్లాలని అభిలషించారు.

# జిల్లా కలెక్టర్‌తో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ భేటీ.



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీమతి ఇలా త్రిపాఠి ఐఏఎస్ ని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అర్బన్ నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై కలెక్టర్‌తో చర్చించారు. పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాల అమలు, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై సమగ్రంగా చర్చించినట్లు తెలిపారు. జిల్లా అభివృద్ధి కోసం జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ దిశగా తన పూర్తి సహకారం అందిస్తానని ఆయన తెలిపారు.

# కరోనా కంటే రోడ్డు ప్రమాదాల్లోనే ఎక్కువ మంది మృత్యువాత.











పోలీస్ కమీషనర్ పి. సాయి చైతన్య.
నిజామాబాద్ జిల్లాలో అరైవ్ అలైవ్ అవగాహన కార్యక్రమశీ.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

నిబంధనలు పాటించి ప్రాణాలను కాపాడుకుందామని పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో జరిగిన జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో ఆయన రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ప్రసంగించారు. 2020 – 21 సంవత్సరంలో కోవిడ్ వల్ల మరణించిన వారి కంటే ఎక్కువ మంది రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కోవిడ్ లో మాస్కులు ధరించి సురక్షితంగా ఉన్నారని, కానీ వాహనాలు నడిపే సమయంలో సీటు బెల్టు, హెల్మెట్లు పెట్టుకోక నిర్లక్ష్యంగా వ్యవహరించి అనేకమంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారన్నారు. రెండేళ్ల కరోనా సమయంలో 200 మంది కరోనాతో చనిపోతే, 2025 వ సంవత్సరంలో 250 మంది రోడ్డు ప్రమాదంలో చనిపోయారన్నారు. కుటుంబ భద్రతకు భరోసాను కల్పిస్తూ సురక్షితమైన డ్రైవింగ్ చేయాలని సూచించారు. గత సంవత్సరం ఫిన్లాండ్ అనే దేశంలో ఒక్క రోడ్డు ప్రమాదం కూడా జరగలేదని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రమాదాల నియంత్రణకు రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ అరైవ్ అలైవ్ అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించారని, దీన్ని ఒక తపస్సు లాగా ముందుకు తీసుకెళ్లాలని అయన సూచించారు. డ్రైవింగ్ లో మూడు సూత్రాలను తప్పకుండా పాటించాలని, పోలీస్ కమీషనర్ విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ, ముఖ్యంగా యువత అతివేగంతో వెళ్లకుండా నెమ్మదిగా వెళ్లాలని, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ బాక్సింగ్ క్రీడాకారుడు, అర్జున అవార్డు గ్రహీత హుషాముద్దీన్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదంలో కుటుంబంలో ఒకరిని కోల్పోయామని అన్నారు. విష్ణు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు, న్యూరో సర్జన్ డాక్టర్ రమనేశ్వర్ మాట్లాడుతూ, హెల్మెట్ ధరించి సెల్ ఫోన్ వాడకుండా క్షేమంగా వాహనాలు నడపుతూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు. తదుపరి రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించి, టీ షేర్ట్స్ మరియు ట్రాఫిక్ నిబంధనలతో కూడినటువంటి స్లోగానికి సంబంధించినటువంటి ప్లే కార్డ్స్ ప్రారంభించారు. విష్ణు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ సౌజన్యంతో వాహనదారులకు 100 హెల్మెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిజామాబాదు అదనపు డీసీపీ (అడ్మిన్) బి. బస్వారెడ్డి, జిల్లా ట్రాన్స్పోర్ట్ అధికారి ఉమామహేశ్వర్, ఆర్టీసీ డిపో మేనేజర్ బి ఎస్ ఆనంద్, ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ ఏ. విశాల్, న్యూరో సర్జన్ డాక్టర్ రమనేశ్వర్, నిజామాబాద్ ఏసిపి రాజా వెంకటరెడ్డి, ట్రాఫిక్ ఏసిపి మస్తాన్ అలీ, తదితరులు పాల్గొనడం జరిగింది.

# భోగిపళ్లు పోయడం తెలుగువారి ఆచారం

## పిల్లల్లో గ్రహపీడ పోవాలనే భోగి పళ్ల వ్యవహారం

రాజమహేంద్రవరం:తెలుగు ప్రజలు జరుపుకొనే ముఖ్యమైన పండుగ సంక్రాంతి. ఈ పండుగను మూడు రోజుల పాటు ఘనంగా జరుపుకొంటారు. ఈ మూడు రోజుల్లో తొలి రోజును భోగి పండుగగా.. రెండో రోజును మకర సంక్రాంతి పండుగగా.. మూడో రోజును కనుమ పండుగగా పిలుస్తారు. అయితే.. ఈ భోగి పండుగ రోజు ఆచరించే ప్రధానమైన ఆచారాల్లో భోగి మంటలు వేయడమే కాకుండా భోగి పళ్లు పోయడం కూడా ఉంటుంది. భోగి పండుగ రోజు సాయంత్రం పెద్దలు తమ ఇంట్లోని ఐదు లేదా ఆరేళ్లలోపు చిన్నారుల తలపై రేగుపళ్లు పోస్తారు. వీటినే భోగి పళ్లు అంటారు. ఈ భోగి పండ్ల కోసం రేగు

పండ్లు, చెరుకు గడలు, బంతిపూల రెక్కలు, చిల్లర నాణెళిలు తీసుకుంటారు. కొన్ని ప్రాంతాల్లో శనగలు, చిటికెడు పసుపు, కొన్ని బియ్యం కూడా కలుపుతారు. ఈ భోగి పండుగ రోజున సాయంత్రం పూట చుట్టుపక్కల ఉండే పెద్దవాళ్లను పిలిచి వారితో పిల్లలకు దిష్టి తీయిస్తారు. గుప్పిట నిండా భోగి పళ్లు తీసుకుని మూడుసార్లు పిల్లల చుట్టూ తిప్పి తలపై పోస్తారు. వాటిని పిల్లలు ఆనందంగా ఏరుకుంటారు.

భోగి పీడ తొలగాలంటే శాస్త్రం ఒక ఉపదేశం చేసింది. అదేమిటంటే.. చెరుకు ముక్కలు, రేగు పండ్లు, పైసలు ఈ మూడింటిని కలిపి చిన్న పిల్లల్ని కూర్చోబెట్టి దిగదుడుపు తీసి తలపై నుంచి కిందకి వదిలేస్తారు. ఇలా చేయడం వల్ల భోగి పీడ తొలగిపోయి.. వాళ్లు భోగం అనుభవించడానికి కావల్సిన శక్తిని పొందుతారని నమ్మిక. సాధారణంగా చిన్న పిల్లలకు నర దృష్టి , గ్రహపీడ కలుగుతూ ఉంటుంది. చిన్న పిల్లల తలపై భాగంలో బ్రహ్మరంధ్రం ఉంటుంది. కాబట్టి తలపై భోగి పండ్లు పోసి ఆ బ్రహ్మరంధ్రాన్ని ప్రేరేపితం చేస్తే పిల్లల్లో జ్ఞానం పెరుగుతుంది. అంతే కాకుండా భోగి పండ్లను విష్ణుమూర్తి స్వరూపంగా భావిస్తారు. కాబట్టి రేగి పళ్ళు పిల్లల తలపై పోయడం వల్ల శ్రీమన్నారాయణుడి ఆశీస్సులు లభిస్తాయని, పిల్లలపై ఉన్న చెడు దృష్టి తొలిగిపోతుందని చెబుతారు.



# రూ.200 కోట్లు

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన ' ది రాజా సాబ్ ' బాక్సాఫీస్ వద్ద దూకుడు కొనసాగిస్తోంది. విడుదలైనప్పటి నుంచి థియేటర్లలో సూపర్ రెస్పాన్స్‌తో సందడి చేస్తున్న ఈ సినిమా, టాక్ మిక్స్‌డ్‌గా ఉన్నప్పటికీ కలెక్షన్ల పరంగా అంచనాలను మించిపోయింది. దర్శకుడు మారుతి తెరకెక్కించిన హారర్‌--కామెడీ ఫాంటసీ జానర్‌లో ప్రభాస్‌ను ఫుల్ ఎంటర్‌టైనర్ మోడ్‌లో చూడటం అభిమానులకు పండగలా మారింది. ప్రభాస్ సినిమా విడుదలవుతుందంటే అది అభిమానులకు మాత్రమే కాదు, ట్రేడ్ వర్గాలకు, సాధారణ ప్రేక్షకులకు కూడా పండగలాంటిదే. ముఖ్యంగా 'కల్కి 2898 ‌ఏడీ' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత ప్రభాస్ నుంచి వచ్చిన సినిమా కావడంతో 'ది రాజా సాబ్‌పై అంచనాలు ఆకాశాన్ని తాకాయి. దర్శకుడు మారుతి హారర్,కామెడీ జోనర్‌లో ప్రభాస్‌ను ఎలా ప్రెజెంట్ చేస్తాడన్న ఆసక్తి కూడా సినిమాపై హైప్‌ను భారీగా పెంచింది. ముఖ్యంగా ప్రభాస్ స్క్రీన్ ప్రెజెన్స్, కామెడీ టైమింగ్, మాస్ ఎలివేషన్స్ అభిమానులను ఆకట్టుకున్నాయి. ట్రేడ్ వర్గాల అంచనాలను తలకిందులు చేస్తూ ఈ చిత్రం ఫస్ట్ డే ప్రపంచవ్యాప్తంగా రూ.112 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసినట్లు నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ప్రకటించింది. 'హారర్ ఫాంటసీ జానర్‌లో తొలి రోజే ఇంత భారీ ఓపెనింగ్స్ సాధించడం ఇదే తొలిసారి అని, ఈ కేటగిరీలో 'ది రాజా సాబ్ కొత్త రికార్డు సృష్టించిందని వారు వెల్లడించారు. అయితే ఫస్ట్ డే తర్వాత మూవీ కలెక్షన్లు భారీగా పడిపోయినట్లు వార్తలొచ్చినా అవన్నీ నిజం కాదని తాజా లెక్కలు నిరూపిస్తున్నాయి. తాజాగా మేకర్స్ మూడు రోజుల కలెక్షన్లను కూడా అధికారికంగా ప్రకటించారు. మూడు రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రూ.183 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసినట్లు మేకర్స్ వెల్లడించారు. సంక్రాంతి పండగ వారం మొదలవుతున్న తరుణంలో ప్రేక్షకుల నుంచి భారీ ఆదరణ లభిస్తోందని కూడా వారు పేర్కొన్నారు. మూడు రోజుల్లోనే ఈ స్థాయి కలెక్షన్లు నమోదు కావడంతో, నాలుగో రోజు సినిమాకు మరింత ఊపు వచ్చే అవకాశం ఉందని ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# జనరేటర్‌లో పంచదార



మాస్ మహారాజా రవితేజ హీరోగా నటించిన తాజా చిత్రం ' భర్త మహాశయులకు విజ్ఞప్తి ' నేడు థియేటర్లలో అడుగుపెట్టి ప్రీమియర్స్ నుంచే పాజిటివ్ టాక్ తెచ్చుకుంటోంది. ముఖ్యంగా ఇటీవల సినిమాలతో కొంత డల్‌గా కనిపించిన రవితేజ ఈ సినిమాతో "వింటేజ్ ఫామ్‌లోకి వచ్చేశాడు" అన్న కామెంట్లు సోషల్ మీడియాలో విస్తృతంగా వినిపిస్తున్నాయి. కామెడీ టైమింగ్, ఎనర్జీ, స్క్రీన్ ప్రెజెన్స్ అన్నీ కలిసి రవితేజ ఫ్యాన్స్‌లో పండగ వాతావరణాన్ని సృష్టించాయి. థియేటర్లలో నవ్వులు, విజిల్స్‌తో సినిమా మంచి రెస్పాన్స్ అందుకుంటుండట ంతో చానాళ్లకు మరో హిట్ పడిందన్న ఆనందంలో అభిమానులు ఉన్నారు. ఈ సినిమాలో ప్రత్యేకంగా చర్చకు వస్తున్న అంశాల్లో ఒకటి జనరేటర్‌కు సంబంధించిన ఓ కామెడీ సన్నివేశం. దర్శకుడు కిషోర్ తిరుమల తన మార్క్ హ్యూమర్‌తో తెరకెక్కించిన ఈ సీన్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఓ సన్నివేశంలో రవితేజ ప్లాన్‌లో భాగంగా జనరేటర్ దగ్గరకు సునీల్ పంచదార బస్తాతో వస్తాడు. అదే సమయంలో వెన్నెల కిషోర్ "ఇదేంటి?" అని ప్రశ్నిస్తే "ప్రతి బ్యాచ్‌లోనూ ఔట్ ఆఫ్ ది బాక్స్ ఆలోచించే ఒకడు ఉంటాడు. ఈ పంచదారకి హెలికాప్టర్లే ఆగిపోతాయి, జనరేటర్ ఒక లెక్కా?" అంటూ ఆ పంచదారని జనరేటర్ ఫ్యుయెల్ బాక్సులో పోస్తాడు. ఈ సన్నివేశం థియేటర్లలో గట్టిగా నవ్వులు పూయిస్తోంది. ఈ సన్నివేశాన్ని చూసిన ప్రేక్షకులు వెంటనే మంచు కుటుంబంలో గతంలో చోటు చేసుకున్న వివాదాన్ని గుర్తు చేసుకుంటున్నారు. జనరేటర్‌లో పంచదార కలిపిన డీజిల్ పోసి విద్యుత్ సరఫరాను నిలిపివేశారని మంచు విష్ణుపై ఆయన సవతి సోదరుడు మంచు మనోజ్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ఘటన వల్ల అగ్ని ప్రమాదం జరిగే అవకాశం ఉందని, తన కుటుంబ ప్రాణాలకు ముప్పు ఏర్పడిందని మనోజ్ అప్పట్లో మీడియాకు లేఖ విడుదల చేయడం పెద్ద సంచలనంగా మారింది. "జనరేటర్‌లో షుగర్ ఎందుకు పోశావు?" అన్న ప్రశ్నకూ "ఇంధనంలో పంచదార కలిపితే మైలేజ్ పెరుగుతుందని వాట్సాప్‌లో చదివాను" అంటూ విష్ణు నవ్వుతూ సమాధానం ఇవ్వడం అప్పట్లో వైరల్ అయ్యింది. అదే సంఘటనను ఇప్పుడు 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సినిమాలో హాస్యంగా రీ-క్రియేట్ చేయడంతో ప్రేక్షకులు మరింత ఎంజాయ్ చేస్తున్నారు.

# టోక్యోలో అల్లు అర్జున్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కెరీర్‌లోనే అతిపెద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'పుష్ప 2: ది రూల్ణ ప్రపంచవ్యాప్తంగా భారత సినీ పరిశ్రమ స్థాయిని మరో మెట్టుకు తీసుకెళ్లింది. విడుదలైన రోజునుంచే సంచలనంగా మారిన ఈ సినిమా ఇండియన్ బాక్సాఫీస్‌ను షేక్ చేస్తూ దాదాపు రూ.1871 కోట్ల గ్రాస్ కలెక్షన్లు సాధించినట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. హిందీ వెర్షన్‌లో వచ్చిన అపూర్వ స్పందనతో పాటు, ఐదు భాషల్లోనూ భారీ వసూళ్లు నమోదు కావడంతో 'పుష్ప 2' 2024లో అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ చిత్రంగా నిలిచింది. 'బాహుబలి 2' రికార్డులను అధిగమించి, అన్ని కాలాల్లో అత్యధిక వసూళ్లు సాధించిన తెలుగు చిత్రాల్లో రెండో స్థానాన్ని దక్కించుకోవడం ద్వారా అల్లు అర్జున్ గ్లోబల్ స్టార్‌గా తన స్థాయిని మరింత బలపరిచారు. జపాన్‌లో ఈ చిత్రాన్ని గీక్ పిక్చర్స్, షోచికు సంస్థలు సంయుక్తంగా విడుదల చేస్తున్నాయి. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి జపాన్ మార్కెట్‌లో 'పుష్ప' మ్యాడ్‌నెస్‌ను మరింత స్థాయికి తీసుకెళ్లాలని నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. జపాన్ ప్రేక్షకులు ఇండియన్ బ్లాక్‌బస్టర్లను ఆదరించిన గత అనుభవం దృష్ట్యా, 'పుష్ప కున్రిన్ణ కూడా అక్కడ ఘన విజయం సాధిస్తుందన్న నమ్మకం చిత్ర బృందంలో కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో సినిమాపై అక్కడ క్రేజ్ పెంచేందుకు అల్లు అర్జున్ స్వయంగా ప్రమోషన్లలో పాల్గొంటున్నారు.

ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి జపాన్ రాజధాని టోక్యోకు చేరుకున్నారు. ఎయిర్‌పోర్టులో వందలాది మంది ఫ్యాన్స్ బన్నీకి ఘన స్వాగతం పలికారు. అనంతరం తన హెూటల్ గదిలో నుంచి నగర అందాలను చూపిస్తూ అల్లు అర్జున్ సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటో ప్రస్తుతం వైరల్ అవుతోంది.



# ఎవరీ గంగమ్మ



జరీనా వహాబ్ ఈ పేరు తెలియడం తెలుగు ప్రేక్షకులకు కొంచెం కష్టం. సంక్రాంతి సినిమాలు చూసినవారికి అయితే ఆమెను వెంటనే గుర్తుపడతారు. జరీనా ఎందుకు తెలియదు. మన రాజాసాబ్ నాన్నమ్మ గంగమ్మ కదా అని అనేస్తారు. ఇంకొంతమంది అయితే.. అరే.. ఆవిడ మన శంకర వరప్రసాద్ గారి తల్లి కదా అని చెప్పేస్తారు. అవును ఆమె.. జరీనా వహాబ్. తల్లి, బామ్మ పాత్రలకు టాలీవుడ్ ఫస్ట్ ఛాయిస్ గా ఆమె నిలిచింది. చూడగానే తల్లి, బామ్మ భావన వచ్చేలా అనిపించే లుక్, ఆ హుందాతనం జరీనాలో కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఈ రెండు సినిమాల్లో ఆమె పాత్ర చాలా కీలకం. బామ్మగా నవ్వించినా.. తల్లిగా ఏడిపించినా కూడా ఆమె పాత్రలకు మంచి మార్కులు పడ్డాయి. అసలు ఎవరీ జరీనా వహాబ్ అంటే.. అచ్చ తెలుగు నటి. ఆమె స్వస్థలం వైజాగ్. పూణేలో నటన నేర్చుకున్న జరీనా.. సినిమాల మీద ఆసక్తితో బాలీవుడ్ లో అడుగుపెట్టింది. మొదట చిన్న చిన్న పాత్రలు చేస్తూ కెరీర్ ని ప్రారంభించింది. ఆ సమయంలోనే స్టార్ హీరో రాజ్ కపూర్.. ఈమె సినిమాలకు పనికిరాదని అవమానించడంతో పట్టుబట్టి తన నటనకు మెరుగులు దిద్ది హీరోయిన్ గా మారింది. 1976లో విడుదలైన చిత్ చోర్ జరీనా లైఫ్ ని మార్చేసింది. ఈ సినిమా హిట్ తరువాత వెనక్కి తిరిగి చూసుకోలేదు జరీనా. హిందీ సినిమాలలోనే కాక మళయాల, తెలుగు, తమిళ, కన్నడ చిత్రాలలో కూడా నటించింది. తెలుగులో కృష్ణ సరసన గాజుల కిష్ణయ్య సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. ఆ తరువాత అమర ప్రేమ, హేమా హేమీలు లాంటి సినిమాలు చేసింది. ఎందుకో జరీనా తెలుగు మీద దృష్టి పెట్టలేదు.. హిందీ, మలయాళ సినిమాలకు అంకితమయ్యి అటే ఉండిపోయింది. కెరీర్ పీక్స్ లో ఉన్నప్పుడే ఆదిత్య పంచోలీని వివాహమాడి కొన్నేళ్లు సినిమాలకు దూరమైంది. ఇక రక్తచరిత్ర సినిమాతో జరీనాను మరోసారి తెలుగుకు పరిచయం చేశాడు రామ్ గోపాల్ వర్మ. అలా తెలుగులో అడపాదడపా కనిపించిన జరీనాను చాల కాలం తరువాత శ్రీకాంత్ ఓదెల .. దసరా కోసం రంగంలోకి దింపాడు. అప్పటినుంచి ఆమె తెలుగువారికి సుపరిచితంగా మారింది. తల్లి, బామ్మ పాత్రలకు టాలీవుడ్ డైరెక్టర్స్ కి ఫస్ట్ ఛాయిస్ గా మారింది. ద రాజాసాబ్ లో ప్రభాస్ నాన్నమ్మ పాత్రలో జరీనా ఒదిగిపోయింది. మహారాణి గంగాదేవిగా ఆమె నటనకు ఫ్యాన్స్ ఫిదా అయ్యారు. మన శంకర వరప్రసాద్ గారు సినిమాలో కూడా చిరు తల్లిగా.. నయన్ కి అత్తగారిగా ఆమె చెప్పే డైలాగ్స్.. ఆ హుందాతనం



# చారులతగా

నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి జంటగా నటించిన చిత్రం 'అనగనగా ఒక రాజు'. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మిస్తుండగా, శ్రీకర స్టూడియోస్ సమర్పించారు. నూతన దర్శకుడు మారి దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈనెల 14న థియేటర్లలో అడుగు పెట్టనుంది. సినిమా రిలీజ్‌కి సిద్ధమైన నేపథ్యంలో కథనాయిక మీనాక్షి చౌదరి మీడియాతో ముచ్చటించారు.

'గుంటూరు కారం, సంక్రాంతికి వస్తున్నాం, అనగనగా ఒక రాజు' ఇలా వరుసగా సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రావడం చాలా చాలా సంతోషంగా ఉంది. గతేడాది 'సంక్రాంతికి వస్తున్నాం'తో మరిచిపోలేని సంక్రాంతి విజయాన్ని అందుకున్నాను. ఇప్పుడు ఈసినిమాతో మరోసారి ప్రేక్షకుల మనసు దోచుకుంటాననే నమ్మకం ఉంది. ల

ఇందులో నా పాత్ర పేరు చారులత. సంపన్న కుటుంబంలో పుట్టిన తండ్రి గారాల పట్టి లాంటి పాత్ర. ఇంట్లో యువరాణిలా పెరుగుతుంది. చాలా మంచి అమ్మాయి. అమాయకంగా, సున్నితమైన మనసు కలిగి ఉంటుంది. క్యూట్‌గా బిహేవ్ చేస్తుంది. నన్ను పూర్తి కామెడీ పాత్రలో చూడబోతున్నారు. ఇలా పూర్తిస్థాయి కామెడీ పాత్ర చేయడం ఇదే తొలిసారి. ఈ సినిమా వల్ల నటిగా నేను మరింత ఓపెన్ అయ్యాను. ఇందులో అద్భుతమైన కామెడీ టైమింగ్ చూస్తారు. ఇది చాలా భిన్నమైన పాత్ర. నిజ జీవితంలో కాలేజ్ సమయంలో ఒకరిద్దరిని ఇలాంటి వారిని చూసి ఉన్నాను. డైరెక్టర్ ఇచ్చిన ఇన్‌పుట్స్‌ని బట్టి, నాకున్న అవగాహనతో ఈ పాత్రలో ఒదిగిపోయే ప్రయత్నం చేశాను.

# 30 ఏళ్ల ప్రయాణం

బాలీవుడ్‌లో తన అందం, అభినయంతో అందాల భామ రాణి ముఖర్జీ ఎన్నో ఏళ్ల పాటు స్టార్ హీరోయిన్ గా కొనసాగింది. స్టార్ హీరోలందరితో నటించిన ఆమె... ఎన్నో హిట్స్ ను సొంతం చేసుకుంది. ఆ తర్వాత పెళ్లి చేసుకుని ఫ్యామిలీ లైఫ్ లో సెటిల్ అయిన రాణి... కొంత కాలం పాటు సినిమాలకు దూరంగా ఉంది. ఇప్పుడు ఆమె మళ్లీ యాక్టింగ్ లో జోరు పెంచుతోంది. 'మర్దానీ 3'తో ప్రేక్షకులను రాణి ముఖర్జీ పలకరించబోతోంది. రూత్‌లెస్ పోలీస్ ఆఫీసర్‌గా ఆమె నటనకు మొదటి రెండు భాగాల్లో ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. 'మర్దానీ' మొదటి భాగంలో అమ్మాయిల అక్రమ రవాణా చేసే ముఠాను ఎదుర్కొంటే, రెండో భాగంలో ఆడపిల్లలపై ఘోర నేరాలకు పాల్పడే సైకో కిల్లర్‌ను పట్టుకునే కథతో ఉత్కంఠ పెంచారు. ఈ రెండు సినిమాలు మంచి హిట్స్‌గా నిలిచాయి.

ఇప్పుడు అదే జోష్‌తో 'మర్దానీ 3'ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి మేకర్స్ సిద్ధమవుతున్నారు. ఈసారి కూడా గర్ల్ చైల్డ్ ట్రాఫికింగ్‌కు పాల్పడుతున్న ప్రమాదకర ముఠాను అంతమొందించేందుకు శివానీ శివాజీ రాయ్ రంగంలోకి దిగబోతోంది. సామాజిక సమస్యలను గట్టిగా చూపించే కథతో మూడో భాగం మరింత ఇంటెన్స్‌గా ఉండబోతుందన్న అంచనాలు ఉన్నాయి. జనవరి 30న 'మర్దానీ 3' థియేటర్లలోకి రానుంది. యశ్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై ఆదిత్య చోప్రా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇంకో విశేషం ఏమిటంటే.. రాణి ముఖర్జీ సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టి ఈ ఏడాదితో 30 ఏళ్లు పూర్తవుతోంది. ఆ ప్రత్యేక సందర్భంగా ఆమె అభిమానులకు ఈ సినిమాను జనవరి 30న కానుకగా ఇవ్వాలని మేకర్స్ భావిస్తున్నారట. ఇటీవల ఈ సందర్భంగా రాణి ముఖర్జీ ఒక భావోద్వేగ నోట్ కూడా పంచుకుంది. తన సినీ ప్రయాణం ఇప్పటికీ నమ్మశక్యంగా లేదని, మొదటి సినిమా 'రాజా కీ ఆయీ హై బారాత్ణ చేసినప్పుడు తన కెరీర్ ఎలా మలుపు తిరుగుతుందో ఊహించలేదని ఆమె పేర్కొంది. 'సాథియా' సినిమా తన జీవితాన్ని మార్చిందని, అలాగే 'బ్లాక్ణ, 'బంటీ ఔర్ బబ్లీ', 'హమ్ తుమ్ణ, 'నో వన్ కిల్డ్ జెస్సికా', 'మిసెస్ చటర్జీ వర్సెస్ నార్వే' వంటి చిత్రాలు తన నట జీవితానికి కొత్త దిశ చూపించాయని రాణి గుర్తు చేసుకుంది.

మూడు దశాబ్దాల సినీ ప్రయాణంలో తనకు తోడుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది.





# అరవింద్ రియాక్షన్

మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటించిన లేటెస్ట్ మూవీ ' మన శంకర వరప్రసాద్ గారు '. అనిల్ రావిపూడి డైరెక్టర్ చేసిన ఈ చిత్రంలో విక్టరీ వెంకటేష్ కీలక పాత్ర పోషించారు. 'భోళా శంకర్ణ వంటి డిజాస్టర్ తర్వాత చిరు నటించిన సినిమా కావడం, వరుసగా 8 బ్లాక్ బస్టర్ చిత్రాలను తెరకెక్కించిన అనిల్ నుంచి వస్తున్న మూవీ కావడంతో ముందు నుంచే ప్రేక్షకుల్లో ఇంట్రెస్ట్ క్రియేట్ అయింది. దానికి తగ్గట్టుగానే ట్రైలర్, సాంగ్స్ హ్యూజ్ బజ్ తీసుకొచ్చాయి. దీంతో అందరిలో మంచి అంచనాలు ఏర్పడ్డాయి. భారీ అంచనాలతో థియేటర్లలోకి వచ్చిన ఈ చిత్రానికి హిట్ టాక్ వచ్చింది.'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 12న వరల్డ్ వైడ్ గా రిలీజ్ అయింది. దీనికి ఆడియన్స్ నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. 70 ఏళ్ల వయసులో చిరంజీవి తన స్వాగ్ తో అందర్నీ సర్ప్రైజ్ చేశారు. కామెడీ, డ్యాన్స్, యాక్షన్ సన్నివేశాల్లో అదరగొట్టారు. ఎన్నో సంవత్సరాల తర్వాత వింటేజ్ మెగాస్టార్ ను స్క్రీన్ మీదకు తీసుకొచ్చారని మెగా అభిమానులు సంబరపడిపోతున్నారు. బాస్ ఈజ్ బ్యాక్ అంటూ పోస్టులు పెడుతున్నారు. తాజాగా ఈ చిత్రానికి అగ్ర నిర్మాత అల్లు అరవింద్ రివ్యూ ఇచ్చారు. సినిమా చాలా బాగుందని అన్నారు.

ఆదివారం రాత్రి నుంచే 'మన శంకర వరప్రసాద్ గారు' సందడి మొదలైపోయింది. పలువురు సినీ ప్రముఖులు ప్రీమియర్ షోలు చూసి, సోషల్ మీడియా వేదికగా తమ అభిప్రాయాలను పంచుకున్నారు. అల్లు అరవింద్ కూడా చిరంజీవి సినిమా చూశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "ఇప్పుడే సినిమా చూశాను. ఆ ఎగ్జైట్మెంట్ మాటల్లో చెప్పలేను. బాస్ చించేశాడు. బాస్ ఈజ్ బాస్. 'రౌడీ అల్లుడు', 'ఘరానా అల్లుడు' వంటి ఓల్డ్ సినిమాల్లో ఆయన్ని చూసిన ఎగ్జైట్మెంట్ మళ్లీ వచ్చింది. టోటల్ నోస్టాల్జిక్ ఫీలింగ్. ఇది సూపర్ హిట్ ఫిలిం. ఎక్సలెంట్ మూవీ. బాస్ ఈజ్ బాస్ అనిపించాడు" అని అన్నారు.